www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 22 డిసెంబర్ 2023
5
వైఎస్ఆర్



విద్యార్థులు నైపుణ్యత పెంచుకోవాలి

కడప అర్బన్ : విద్యార్థులు నైపుణ్యత పెంచుకోవాల్సిన అవసరం ఉందని ఎపి ఎస్-ఎస్‌డిసి శిక్షకులు ఉమామహేశ్వరరావు కుల్దీప్ రెడ్డి అన్నారు. గురువారం కెఒఆర్ఎం కళాశాలలో పిసిబి డిజైన్ పై వర్క్ షాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారం రోజులపాటు పిసిబి డిజైన్‌పై ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ జి.లావణ్య మాట్లాడుతూ పిసిబి డిజైన్ ఇండస్ట్రీ ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. కెఒఆర్ఎం కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఎల్లప్పుడూ విద్యార్థులకు ఇండస్ట్రీ రిక్వైర్మెంట్స్ అందించడానికి కరస్పాండెంట్, సెక్రటరీ లిఖితా రెడ్డి సహాయ సహకారాలు అందిస్తూ ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇసిఇ విభాగ అధిపతి చంద్రకళ, రెడ్డి ప్రసన్న, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ రెడ్డిమురళి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ తులసి కృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

వెనక్కి తగ్గం..

అంగన్వాడీలు నిర్వహిస్తున్న సమ్మె రోజురోజుకూ ఉధృతం అవుతోంది. గురువారం పదో రోజు వినూత్నంగా నిరసన తెలియజేశారు. తమ డిమాండ్లు తీర్చేందుకు ప్రభుత్వం దిగొచ్చే వరకూ వెనక్కి తగ్గేదే అంటూ ఆందోళన చేపడుతున్నారు.



వేంపల్లె: పాపాగ్ని నదిలో జలదీక్ష చేస్తున్న అంగన్వాడీలు



దువ్వూరు : సమ్మె చేపట్టి పదవ రోజు కావడంతో '10' ఆకారంలో కూర్చొని నిరసన

గడ్డితింటూ.. మానవహారం నిర్వహిస్తూ .. భిక్షాటన, జలదీక్ష చేస్తూ..అంగన్వాడీల నిరసన ఎంపీ వై.ఎస్.అవినాష్‌రెడ్డికి వినతి



మైదుకూరు : గడ్డి తింటూ నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు


కడప అర్బన్ :రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్టు ఎదుట సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది రోజులుగా అంగన్వాడీలో సమ్మె చేస్తుంటే సిఎం జగన్మోహన్ రెడ్డి స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. లక్షా పదివేల మంది మహిళలు రాష్ట్రవ్యాప్తంగా సమ్మెలో ఉన్నారని పేర్కొన్నారు. మహిళలు కన్నీరు కారుస్తే మంచిది కాదని పేర్కొన్నారు. శాంతి యుతంగా సమ్మెను విరమింపజేయాలని ప్రభుత్వాన్ని సూచించారు. సిఎం స్పందించకపోతే ఓటు అనే ఆయుధంతో అంగన్వాడీలు తమ సత్తా చూపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు విష్ణు ప్రియతమ రెడ్డి, జిల్లా అధ్యక్షులు శ్రీరాములు, ఎన్ఎస్‌యు ఐ బాబు, యూత్ కాంగ్రెస్ మధు రెడ్డి, చీకటి చార్లెస్, అలీ ఖాన్, లక్ష్మయ్య, నరసింహులు, పాలగిరి శివ, బాష, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ అర్బన్ ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి అంజలీదేవి, డివైఎఫ్ఐ నగర్ కార్యదర్శి ఓబులేసు, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **వేంపల్లె :** అంగన్వాడీలకు వేతనాలు పెంచే వరకు ఉద్యమం ఆగదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జల ఈశ్వరయ్య పేర్కొన్నారు. అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన సమ్మె గురువారం నాటికి 10వ రోజు చేరింది. విన్నూతంగా అంగన్వాడి మహిళాలు అందరూ వేంపల్లెలోని పాపాఘ్ని నదిలోకి వెళ్లి జల దీక్ష చేసి నిరసన వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ జల దీక్షకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జల ఈశ్వరయ్య, అంగన్వాడీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంజులా సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఏరియా సహాయ కార్యదర్శి బ్రహ్మం, ఏరియా కార్యదర్శి వెంకట రాములు, సిఐటియు నాయకురాలు లలితామ్మ, సావిత్రి, ఎఐటియుసి నాయకులు సరస్వతి, శైలజాలతో పాటు అంగన్వాడీలు పాల్గొన్నారు. **పులివెందుల టౌన్ :** రాష్ట్రవ్యాప్తంగా సమ్మె ప్రారంభించి 10 రోజులు అయిన సందర్భంగా గురువారం పులివెందుల తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో 10 ఆకారంలో అంగన్వాడీలు నిరసన తెలిపారు. అనంతరం కడప పార్లమెంట్ సభ్యులు అవినాష్‌రెడ్డిని కలిసి తమ సమస్యలను వివరించారు. దీనికి ఆయన స్పందిస్తూ ఈనెల 25న ముఖ్యమంత్రి పులివె ందులకు వస్తారని మీ సమక్షంలోనే మీ సమస్యలను వివరిస్తానని హామీ ఇచ్చారు. **మైదుకూరు :** 'జగనన్నా.. మీకు కేకులు మాకు గడ్డి' అంగన్వాడీ కార్యకర్తలు గడ్డి తిని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి జి.శివకుమార్ మాట్లాడుతూ 10 రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోక పోవడం సిగ్గుచేటన్నారు. పాదయాత్రలో జగన్ రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, సిఎం జగనన్న అంగన్వాడీ మహిళల పట్ల కనికరం చూపి జీతాలు పెంచడంతో పాటు అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ ఏరియా కార్యదర్శి శ్రీరాములు, మండల కార్యదర్శి షరీఫ్, మండల సభ్యులు జహంగీర్‌బాష, సుధాకర్, సిఐటియు, ఎఐటియుసి, సభ్యులు భారతి, ధనలక్ష్మి, చెన్నమ్మ, శోభ, రజియా, వెంకటలక్ష్మి, లక్ష్మీదేవి, రమాదేవి, శివలక్ష్మి, వెంకటసుబ్బమ్మ, జ్యోతి, అనూష పెద్ద ఎత్తున అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నియంతలా వ్యవహరిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక తాసిల్దార్ కార్యాలయం ఎదుట 10వ రోజు అంగన్వాడీ చేస్తున్న సమ్మెకు మద్దతుగా ఆయన నిలిచారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి పాల్గొన్నారు.అంగన్వాడి వర్కర్లను వేధించడం తగదని, రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాపరెడ్డి,రాయలసీమ విద్యార్థి సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలు భిక్షాటన చేస్తూ 10 రోజుల నుంచి సమ్మె చేస్తుంటే సమస్యలు పరిష్కరించకుండా వారిని చర్చలకు పిలిచి వారి జీతాల విషయం మాట్లాడకపోవడం బాధాకరమని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. ౧ అంగన్వాడీలు పట్టణంలో భిక్షాటన చేస్తూ తమ నిరసన తెలియజేశారు. అంగన్వాడీలకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రవీణ్ కుమార్ రెడ్డి భోజన వసతి కల్పించారు. ఆయన సతీమణి మౌనిక, అక్క హరిత వారికి మద్దతు పలికారు. 21 పిడి టిఆర్ పుట్టపర్తి సర్కిల్ భిక్షాటన చేస్తున్న అంగన్వాడి కార్యకర్తలు **చాపాడు :** తమ న్యాయమైన కోరికలను పరిష్కరించాలని పదో రోజు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు నిరసనచేపడుతున్నారు. సమ్మెలో భాగంగా గురువారం అంగన్వాడీ కార్యకర్తలు భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. గ్రామంలో దుకాణాలు గృహాల వద్దకు భిక్షాటన చేస్తూ తమ నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, అంగన్వాడీ కార్యకర్తలు, నాయకులు సుజాత, అరుణ ,రామలక్ష్మి, రాధా, సరస్వతి, ఆదిలక్ష్మి, మహాలక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు. **పోరుమామిళ్ల** :పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిఐటియు మండల నాయకులు బొజ్జా చిన్నయ్య అధ్యక్షతన అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, మినీ అంగన్వాడీ కార్యకర్తలు సమ్మె నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కోకిలంపాడు. శ్రీనువాసులు , జిల్లాకమిటీ సభ్యురాలు ఓబులాపురం విజయమ్మ, అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి మేరీ, వినోదా, దస్తగిరిమ్మ, రేణుక, విజయమ్మ, జ్యోతిమ్మ ,రమాదేవి, శ్రీదేవి ,లక్ష్మీదేవి 200మంది అంగన్వాడి వర్కర్లు హెల్పర్లు మినీ అంగన్వాడి వర్కర్లు, సిఐటియు చిన్నయ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **జమ్మలమడుగు :** స్థానిక ఐసిడిఎస్ ఆఫీసు ఎదుట అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం వారి న్యాయమైన డిమాండ్ల సాధన కోసం 10 రోజులుగా నిర్వహిస్తున్న సమ్మెకు మద్దతుగా భిక్షాటన చేపట్టారు. భిక్షాటనతో అయినా ప్రభుత్వానికి కనివిప్పు కలగాలని సిఐటియు పట్టణ కార్యదర్శి దాసరి విజయ్, ఎస్ ఎఫ్ ఐ జిల్లా సహాయక కార్యదర్శి వినయ్ కుమార్ అన్నారు. కార్యక్రమంలో ఏఐటియుసి సుబ్బారెడ్డి, చాంద్ బాషా, నరసమ్మ. సిఐటియు నాయకులు కులాయమ్మ లక్ష్మీదేవి పాల్గొన్నారు.



పులివెందుల : ఎంపీ అవినాష్‌రెడ్డికి సమస్యలు విన్నవిస్తున్న అంగన్వాడీలు



జమ్మలమడుగు : దుకాణం వద్ద భిక్షాటన చేస్తున్న అంగన్వాడీలు



కడప : అంగన్వాడీ సమ్మెకు మద్దతు తెలియజేస్తున్న తులసిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు



కడప ఏడు రోడ్ల కూడలి వద్ద పద్మవ్యూహాన్ని తలపిస్తున్న ట్రాఫిక్

పద్మవ్యూహమే

- సర్కిళ్ల అభివృద్ధి పేరుతో సర్కస్
- కడపలో స్తంభించిన రహదారులు
- సిఎం సెక్యూరిటీ సిబ్బంది రాకతో సతమతం
- రోగులు, విద్యార్థులు, ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు

కడప నగరం పద్మవ్యూహాన్ని తలపిస్తోంది. కడప కార్పొరేషన్ కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) నగరంలోని సర్కిళ్ల ఆధునికీకరణ పనులకు శ్రీకారం చుట్టింది. వ్యూహాత్మక ధోరణిలో దశల వారీగా పనుల్ని చేపట్టకపోవడంతో ట్రాఫిక్ సమస్య తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జిల్లా పర్యటన ఖరారైన నేపథ్యంలో సెక్యూరిటీ సిబ్బంది జిల్లా కేంద్రానికి రావడంతో ట్రాఫిక్ సమస్య రెట్టింపైంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప ట్రాఫిక్ సమస్యతో స్తంభించిపోతోంది. జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది కడపకు రాకపోకలు సాగిస్తున్నారు. సాధారణ పరిస్థితుల్లో నగరంలో ట్రాఫిక్ మోస్తరుగా ఉంటోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో కడప కార్పొరేషన్ కోట్లాది రూపాయల వ్యయంతో నగరంలోని పలు సర్కిళ్లను ఆధునీకరిస్తోంది. కోటిరెడ్డి, అంబేద్కర్, వైజంక్షన్, ఏడురోడ్ల, గోకుల్‌లాడ్జి, అన్నమయ్య, మాసాపేట వంటి కీలక సర్కిళ్ల ఆధునికీకరణ పనుల్ని వేగవంతం చేసింది. సర్కిళ్లను అభివృద్ధి చేయడం ఆహ్వానించదగినదే. ఎంపిక చేసుకున్న సమయం, వ్యూహాత్మక ధోరణి కొరవడిన ఫలితంగా ప్రజానీకాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది.

ట్రాఫిక్ మళ్లింపుతో సతమతం

కోటిరెడ్డి సర్కిల్ ఆధునీకరణ నేపథ్యంలో ట్రాఫిక్‌ను మళ్లించడం అనివార్యంగా మారింది. సంధ్యా సర్కిల్ నుంచి జిల్లా పరిషత్ మీదుగా మళ్లించడంతో జిల్లా పరిషత్ నుంచి పాతబస్టాండు వరకు రద్దీగా మారింది. ట్రాఫిక్ స్తంభించిపోతోంది. సెవెన్ రోడ్స్ సర్కిల్ నుంచి మిగిలిన సర్కిళ్లన్నింటిలో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. బస్సులు మొదులకుని ద్విచక్ర వాహనాలతో రహదారి రద్దీగా మారింది. పాలు, నిత్యావసర వాహనాలు, ఇతర సామాగ్రితో కూడిన భారీ వాహనాలొస్తే ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఫలితంగా జిల్లాలోని వందలాది ఆస్పత్రులకు వెళ్లాల్సిన రోగులు, వందలాది విద్యాసంస్థలకు వెళ్లాల్సిన విద్యార్థులు, ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలకు వెళ్లాల్సిన రోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

కొరవడిన ముందుచూపు

నగరంలోని సర్కిళ్ల ఆధునికీకరణ పనులు చేపట్టడానికి ముందు అవసరమైన కసరత్తు కొరవడింది. పనులకు ముందు పత్రికల్లో బుగ్గవంక రహదారులపై కథనాలు సైతం రావడం గమనార్హం. అప్పటికైనా కార్పొరేషన్ పాలనా యంత్రాంగం స్పందించి ఉంటే బాగుండేది. బుగ్గవంక రక్షణకు గోడకు ఇరువైపులా రహదారి పనుల్ని పూర్తి చేయించి పనులు చేపట్టాల్సి ఉండేది. అటువంటి ముందుచూపు కొరవడిన ఫలితంగా ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. గురువారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి సెక్యూరిటీ సిబ్బంది రావడంతో ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్, సంధ్యా సర్కిళ్లలో ట్రాఫిక్ స్తంభించిపోతోంది.

ఆర్అండ్‌బి దగ్గర గందరగోళం

కడప ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్ దగ్గర ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఒక్కోసారి 20 నిమిషాల వరకు వాహనాలు ఆగిపోతున్నాయి. గురువారం సాయంత్రం ఆరు గంటల సమయంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరణకు పోలీసులు లేకపోవడంతో నాలుగు వైపులా రహదారుల నుంచి వచ్చే వాహనాలతో స్తంభించిపోయింది. ఫలితంగా నాగరాజుపేట ప్రాంతంలోని చిన్నచిన్న సందులు, గొందుల గుండా ద్విచక్ర వాహనాలతో కిక్కిరిసిపోవడం కనిపించింది. మధ్యాహ్నం జిజిహెచ్‌కు వెళ్లే రహదారిని పోలీసులు స్తంభింపజేశారు. ఆస్పత్రికి వెళ్లే రోగులు, ఇంటికి వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురికావడం ఆందోళన కలిగించింది.

భయాన్ని పోగొట్టేందుకే పరీక్షలు : పిఒ

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థులోపున్న భయాన్ని పోగొట్టేందుకు పోటీ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడుతాయని ఎస్ఎస్ఎ పిఒ అంబరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం చెకుముకి సైన్స్ సంబరాలు భాగంగా మండల స్థాయి పరీక్షలు గురువారం నగరంలో సిఎస్ఐ పాఠశాలలో నిర్వహించారు. చెకుముకి పరీక్షల బాధ్యులు వెంకటేశ్వర్లు, సమతా విభాగం నాయకులు సునీత, జన విజ్ఞాన వేదిక నగర అధ్యక్షులు శివరాం, గోవిందు, ఆర్ఎస్‌వైఎఫ్ నాయకులు సుబ్బరాయుడు, ఎస్ఎఫ్ఐ నాయకులు సునీల్, సురేష్, డివైఎఫ్ఐ నాయకులు ఓబులేసు ఆధ్వర్యంలో పోటీ పరీక్షలు నిర్వహించారు. ఇందులో టీముకు ముగ్గురు చొప్పున నగరంలో 43 టీములు వేయగా ప్రైవేటు పాఠశాలల నుంచి 13 టీములుగా, ప్రభుత్వ పాఠశాలల నుండి 160 మంది విద్యార్థులు పాఠశాల స్థాయిపోటీ పరీక్షలలో నుంచి ఎంపికైనట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. వీరందరిలో బాగా రాసినటువంటి కొన్ని టీములని ఎంపిక చేసి వారిని విజేతలుగా ప్రకటి ంచారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఎస్ఎ పిఒ విజేతలకు బహు మతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి రాజశేఖర్ రాహుల్, జిల్లా కార్యదర్శి బాల బయన్న పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం చిత్తా ప్రభావతి

'చెకుముకి'లో విద్యార్థుల ప్రతిభ

కలసపాడు :మండలంలోని బాలికోన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, స్థానాలను స్థానిక సెయింట్ ఆంటోనీ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు కైవసం చేసుకున్నారు. యశ్వవర్ధన్ రెడ్డి, కిరణ్ కుమార్‌రెడ్డి, దీక్షిత్ రెడ్డి తమ ప్రతిభ చాటారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు చిత్తా ప్రభావతి మాట్లాడుతూ విద్యా ర్థులకు చదువుతోపాటు వారి జ్ఞానాన్ని మెరుగుపరిచేందుకు అనేక సైన్స్ కాంపిటీషన్ పరీక్షలకు తయారు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సైన్సు ఉపాధ్యాయులు, రమణాచారి, ఎంవిఆర్ పాల్గొన్నారు.

సమస్యలపై పోరాడేందుకు సన్నద్ధం

ప్రజాశక్తి -కడప అర్బన్

నగరంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై పోరాడేందుకు సన్నద్ధమవుతున్నట్లు కడప అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి, సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ త్వరలో అన్ని వర్గాల ప్రజల వద్దకు వెళ్ళి వారి సమస్యలను తెలుసుకుంటానని పేర్కొన్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేవరకు కృషి చేస్తానన్నారు. నగరంలో పలు వీధుల్లో రోడ్లు, డ్రెయినేజీ సమస్య ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం కంది బెడలు అందిస్తామని ప్రకటించిన చాలా ప్రాంతాల్లో రేషన్ ఆపరేటర్లు ఇవ్వడం లేదన్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. త్వరలో నగరంలో గడప గడపకూ సలావుద్దీన్ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. నాలుగేళ్ల ముందు దేవుని కడప చెరువు కట్టను ట్యాంక్ బండ్‌ను ఏర్పాటుకు శంఖుస్థాపన చేశారని, ప్రస్తుతం దాన్ని విస్మరించారని తెలిపారు. రవీంద్రనగర్ గుర్రాలగడ్డ, లా కళాశాల నాగరాజుపేట అనుసంధాన బ్రిడ్జి నిర్మాణాలు త్వరగా చేపట్టాలన్నారు. హజ్ హౌస్ మిగిలిన పనులు కూడా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల నోటిఫికేషన్ ముందే పనులు ప్రారంభించాలని లేకుంటే అన్ని తడి ఇసుకపై గీతలవుతాయన్నారు. ఇక ప్రజాసేవయే తన జీవిత లక్ష్యమన్నారు.



మాట్లాడుతున్న సలావుద్దీన్

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

చెన్నూరు :మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలలోలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ఎంపిపి సురేష్, వైసిపి చెన్నూరు కన్వీనర్ జి.ఎన్. భాస్కర్ రెడ్డి, సర్పంచ్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ జగనన్న పుట్టినరోజు సందర్భంగా బై జ్యూస్ ట్యాబ్ పంపిణీ కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. వైసిపి కన్వీనర్ మాట్లాడుతూ మేనమామ 8వ తరగతి విద్యార్థులందరికీ ట్యాబ్‌లు పంపిణీ సంతోషక రమన్నారు. మండల విద్యాశాఖ అధికారి గంగిరెడ్డి మాట్లాడుతూ ఎనిమిదో తరగతి విద్యార్థులు మొత్తం 268 మంది ఉన్నారని, వారికి అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 సునీత, జడ్‌పి హెచ్‌ఎస్ ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

కడప అర్బన్ : దీన బంధు స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు జనార్దన్ రెడ్డి రూ.50 వేలు జిల్లా విద్యాశాఖ అధికారికి ఎద్దుల రాఘవరెడ్డికి ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా చేతుల మీదుగా అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రోత్సాహకాలుగా అందించాలని కోరారు. గురువారం నగరంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల జయనగర్ కాలనీలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదిన సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో జనార్దన్ రెడ్డి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు జిల్లాస్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన వారికి వరుసగా మొదటి ఐదు స్థానాలు రూ.15 వేలు, రూ.12500, రూ.10000, రూ. 7500, రూ.5000 అందజేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిని కోరారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి, జిల్లా విద్యాశాఖ అధికారి ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కడప మండల విద్యాశాఖ అధికారి పాలెం నారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరానికి స్పందన

కడప అర్బన్ : నగంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ విశ్వవిద్యాలయంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 51వ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన విసి ఆచార్య బి. ఆంజనేయ ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఈ.సీ సురేంద్రనాథ్ రెడ్డి హాజరయ్యారు. 50 మందికి పైగా అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వై. పవన్ కుమార్ రెడ్డి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ,అధ్యాపక,అధ్యపకేతర సిబ్బంది, విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

నానో మెటీరియల్‌పై అవగాహన సదస్సు

చింతకొమ్మదిన్నె:స్థానిక అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం వైపీయూ మెటీరియల్ సైన్స్, నానో మెటీరియల్స్‌పై నానోటెక్నాలజీ సహాయ ఆచార్యులు డాక్టర్ ఎం. మమతకుమారి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నానో స్కేర్ వద్ద నిర్మాణంతో కూడిన పదార్థాలు తరచూ ప్రత్యేకమైన ఆప్టికల్, ఎలక్ట్రానిక్, మెకానికల్ లక్షణాలను కల్గి ఉంటాయని చెప్పారు. నానో మెటీరియల్స్‌పై ఆమె విద్యార్థులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి అవగాహన కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతిక అభివృద్ధికి దోహద పడుతాయని చెప్పారు. కార్యక్రమంలో కె.ఎస్. శశికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

24న కంటి వైద్య శిబిరం

పోరుమామిళ్ల : బద్వేల్ పట్టణంలోని బిజీవేముల వీరా రెడ్డి కంటి ఆసుపత్రిలో ఈనెల 24న నిర్వహించబోయే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని టిడిపి మండల అధ్యక్షులు నగిరి భైరవ ప్రసాద్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ రవికుమార్ రెడ్డి, డాక్టర్ శాంతి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారన్నారు. 25న మాజీ మంత్రి వీరారెడ్డి వర్ధంతి సందర్భంగా పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఉచిత వైద్యం అందించాలనే ఉద్దేశంత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారన్నారు. సదవకాశాన్ని పోరుమామిళ్ల మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

కడప : కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్ ఆధ్వ ర్యంలో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ రాజ్యసభ సభ్యు లు, పిసిసి మీడియా చైర్మన్ తులసి రెడ్డి, విశిష్ట అతిథులు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుండ్ల కుంట శ్రీరాములు, నగర అధ్యక్షులు విష్ణు ప్రీతం రెడ్డి పాల్గొని క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రిస్మస్ అనేది రెండు గ్రీకు పదాల కలయిక 'క్రిస్' అంటే క్రీస్తు 'మస్' అంటే ఆరాధించడం క్రిస్మస్ అంటే క్రీస్తును ఆరాధిం చడం అని అన్నారు. కార్యక్రమంలో మోపూరి వెంకట రమణారెడ్డి, కోట పాటి లక్ష్మయ్య, మధు రెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, పాలగిరి శివ, మామిళ్ళ బాబు, ఖాదర్ ఖాన్, కుళ్లాయప్ప, కోపూరి శ్రీనివాసులు, ఆనంద్, గౌసియా షేక్, నాగరాణి, గౌరీ, నరసిం హారెడ్డి, మామిళ్ళ నరసింహులు, పృథ్వి, ఊర్మిళ, చాంద్ బాషా, పటాన్ మహమ్మద్ అలీ ఖాన్, అబ్దుల్ రసూల్, వేణుగోపాల్, సూర్యం, అశోక్, అమర్, వినయ్ పాల్గొన్నారు.

యువగళం విజయవంతం

కడప అర్బన్ : టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు బాబు నాయుడు, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, ఎమ్మెల్యే, పొలిట్ బ్యూరో సభ్యులు నందమూరి బాలకృష్ణను ఒకే వేదిక మీద చూసేసరికి వైసిపి ప్రభుత్వానికి మరింతగా భయం పుట్టుకుందని టిడిపి కడప జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్ అన్నారు. ఐదు లక్షల జనాభా హాజరుతో యువగళం నవ శకం విజయవంతమైందని తెలిపారు.

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలి

కమలాపురం : గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామ రెవెన్యూ సహాయకులు నిరసన తెలియజేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఆర్. లక్ష్మితో కలసి విలేకర్లతో మాట్లాడారు. సహాయకులు రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో కింది స్థాయిలో పనిచేస్తూ ప్రజలతో నిత్యం సంబంధాలు కల్గి ఉంటూ, వారి సమస్య పరిష్కారంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. పేరుకు మాత్రమే తాత్కాలిక ఉద్యోగులని, రాత్రి పగలు తేడా లేకుండా పనిచేస్తున్నారని వాపోయారు. గతంలో పాదయాత్ర సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి విఆర్ఎల దీక్ష శిభిరాన్ని సందర్శించి అధికారంలోకి రాగానే తక్షణమే పరిష్కరిస్తానని హామీ ఇచ్చి మరిచారని పేర్కొన్నారు. వెంటనే విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ఉష, ఆంటోనీ , భాస్కర్ పాల్గొన్నారు

డిసిఒపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

కడప అర్బన్ : రైల్వే కొండాపురం బాలికల గురుకుల పాఠశాలలో కిందిస్థాయి సిబ్బందిని వేధిస్తున్న ప్రిన్సిపల్‌కు వత్తాసు పలుకుతున్న గురుకుల పాఠశాలల డిసిఒ జిల్లా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్, జిల్లా కార్యదర్శి గండి సునీల్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఎఒ విజయ్ కుమార్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వే కొండాపురం బాలికల గురుకుల పాఠశాలలో గతంలో విద్యార్థులను లైంగికంగా వేధిస్తున్నారనే ఆరోపణలతో కొంతమంది సిబ్బందిపై చర్యలు తీసుకున్నారని తెలిపారు. తరువాత ఆరోపణలు వచ్చిన సిబ్బందిని మళ్ళీ యధావిధిగా కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై జాయింట్ కలెక్టర్‌ని కలిసి పిర్యాదు చేయగా సిబ్బందిని వెంటనే బదిలీ చేయాలని డిసిఒను ఆదేశించారని చెప్పారు. అయితే ఆయన ప్రిన్సిపల్‌ను బదిలీ చేస్తూ 4 సార్లు మెమోలు ఇచ్చారని పేర్కొన్నారు. అయిన ప్రిన్సిపల్ అక్కడే ఉంటూ కిందిస్థాయి సిబ్బందిని వేధింపులకు గురిచేస్తూ మానసికంగా వేధిస్తున్నారని తెలిపారు. చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మనోజ్ పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రామలింగకుమార్‌రెడ్డి

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - మైదుకూరు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం పట్టణంలో ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి, ఎస్ఎల్ఆర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ రామలింగకుమార్‌రెడ్డి, క్యాన్సర్ వైద్యనిపుణులు డాక్టర్ రాఘవేంద్రరెడ్డి 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. రూ.15 వందల విలువైన క్యాన్సర్ స్క్రీనింగ్, గుండె స్కానింగ్, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 4 కొత్త క్యాన్సర్ కేసులు, ఏడుగురికి కొత్తగా గుండె జబ్బు కేసులు గుర్తించి వారికి ఆరోగ్య శ్రీ ద్వారా వైద్యం అందించడానికి సిఫార్సు చేశారు.

నమ్మించి మోసగించిన జగన్ : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాల ప్రజలను నమించి మోసం చేశారని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. జగన్ పుట్టినరోజును నమ్మకద్రోహ దినంగా గుర్తించాలని గురువారం ఆయన స్థానిక విలేకరులకు తెలిపారు. రైతులు, కార్మికులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థులు, యువత, మహిళలు, మందు బాబులతోపాటు ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ అందరినీ జగన్ మోసగించారన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించి ఔట్ సోర్సింగ్ సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం కల్పిస్తానని చెప్పి ఉద్యోగులను మోసం చేసినట్లు తెలిపారు. ప్రత్యేకహోదా సాధించి ఉద్యోగాల విప్లవం తెస్తానని చెప్పారని గుర్తు చేశారు. ప్రతి ఏడాది జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని నమ్మించి మోసం చేసినట్లు వివరించారు. దశలవారీ మద్య నిషేధాన్ని అమలు చేస్తానని చెప్పి మహిళలను కూడా మోసగించినట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను తీర్చని సిఎం జగన్ ప్రభుత్వాన్ని వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓడించి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని తులసిరెడ్డి ప్రజలను కోరారు.



ఎంపికైన క్రీడాకారులతో ప్రిన్సిపల్ తాతాజీ, ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి పోటీలకు పాలిటెక్నిక్ విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - సింహాద్రిపురం

రాష్ట్రస్థాయిలో జనవరి 4 నుంచి జరిగే క్రీడా పోటీలకు పాలిటెక్నికల్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ తాతాజీ పేర్కొన్నారు. గురువారం నిడివెలగల సమీపంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఎంపికైన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18, 19 తేదీల్లో ఉమ్మడి కడప జిల్లాస్థాయి స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ రాజంపేటలో నిర్వహించారన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు 11 మంది విద్యార్థులు ఎంపిక కావడం హర్షణీయమన్నారు. ప్రిన్సిపల్ తాతాజీ, హెచ్ఒడి శివశంకర్, ఫిజికల్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి అభినందించారు.



విద్యార్థులకు షీల్డ్ అందజేస్తున్న జెవివి కన్వీనర్ సూర్యచంద్రారెడ్డి

చెకుముకి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలస్థాయి చెకుముకి పోటీల్లో కోరగుంటపల్లె జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచినట్లు జన విజ్ఞాన వేదిక మండల కన్వీనర్ సూర్యచంద్ర రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రమైన సింహాద్రిపురం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి నిర్వహించారు. ఈ పోటీలలో ప్రథమ స్థానం సాధించిన కోరగుంటపల్లె విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపిక కావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వరమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : ముద్దనూరు రోడ్డులోని బాలికల జూనియర్ కళాశాలలో జమ్మలమడుగు, పెద్దముడియం, మైలవరం మండలాల చెకుముకి మండలస్థాయి పరీక్ష విజయవంతంగా ముగిసిందని జెవివి జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర తెలిపారు. ముందుగా క్యాంబెల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆగస్టిన్ రాజు ప్రశ్నాపత్రాన్ని విడుదల చేశారు. పరీక్ష అనంతరం సాయంత్రం మొదటి, ద్వితీయ, తృతీయంగా వచ్చిన విద్యార్థులకు జమ్మలమడుగు ఎంఇఒ పరమేశ్వరయ్య మెడల్, మెమెంటో, సర్టిఫికెట్ అందజేశారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్, జిల్లా ఉపా ధ్యక్షులు డేవిడ్‌రాజ్, పాఠశాలల స్థాయి విద్యార్థులు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం : చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా మండలస్థాయి పరీక్షలు గురువారం వేమారెడ్డి సత్రంలో నిర్వహించారు. పరీక్షల నిర్వహణలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు కలివేల రాజశేఖర్, ఎర్రంపల్లి అజయ్ జరిగాయి. మొదటి విజేతగా దీప్తి స్కూల్, రెండవ విజేతగా బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంపికయ్యాయి. బహుమతుల కార్యక్రమానికి పూర్వ ఉపాధ్యాయులు చెన్నారెడ్డి, సుబ్బారెడ్డి హాజరయ్యారు.

ప్రొద్దుటూరు : జెవివి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబరాలు విజయవంతమయ్యాయి. స్థానిక తొగటవీరక్షత్రియ కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జెవివి పట్టణ అధ్యక్షుడు పోలంకి శ్రీరాములు శిబిరం ముగిసిన అనంతరం సాయంత్రం ప్రసంగించారు. మొదటి ముగ్గురు విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ క్రిష్టప్ప, ఎంఇఒ క్రిస్టఫర్, మానసిక వైద్య నిపుణురాలు డా.కవితా ప్రసన్న, ప్రధానోపాధ్యాయులు గోపీనాథరెడ్డి మాట్లాడారు. ఐఎఎస్ అకాడమీ కోచ్ రవిశంకర్ విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకునే మార్గాన్ని బోధించారు. కార్యక్రమంలో జెవివి నాయకులు తవ్వా సురేష్, మురళీగుప్తా, 300 మంది విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : స్థానిక జడ్‌పి పాఠశాలలో జెవివి ఆధ్వర్యంలో గురువారం మండలస్థాయిలో విద్యార్థులకు చెకుముకి పోటీలను నిర్వహించారు. పోటీలకు మండల వ్యాప్తంగా 12 టీంలు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు షీల్డ్, మెడల్స్, సర్టిఫికెట్స్ అందించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఇఒలు శివప్రసాద్, వెంకటేశ్వర్లు హాజరయ్యారు. విజేతలు జనవరి 7న జిల్లాస్థాయి చెకుముకి సంబరాల్లో పాల్గొంటారని తెలిపారు. ఉపాధ్యాయులు బాలకృష్ణ, తులసీశ్వరయ్య, రాంగోపాల్, చంద్రఓబుల్‌రెడ్డి, జెవివి నాయకులు సుజన్ కుమార్, షరీఫ్, సుజయ్ పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

ప్రజాశక్తి - చాపాడు

కొన్నేళ్లుగా గుంతల రోడ్లలో తిరగలేక ఇబ్బందులు పడిన మండల ప్రజలకు చాలా వరకు సమస్యలు తొలగిపోయాయి. మండల పరిధిలోని గ్రామీణ రోడ్లకు మహర్దశ ఏర్పడిందని చెప్పవచ్చు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత మండల పరిధిలో రూ.20 కోట్లకుపైగా గ్రామీణ రహదారులు అభివృద్ధి చేస్తున్నట్లు మైదుకూరు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పేర్కొన్నారు. రూ.2.82 కోట్లతో చియ్యపాడు-చింతకుంట రహదారి ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన నిధులతో నిర్మించారు. ఆర్‌అండ్‌బి నిధులతో మండల పరిధిలో 4 రహదారులను నిర్మించారు. ఖుజ్యాయపల్లె ఆర్‌అండ్‌బి రోడ్డుకు రూ.25కోట్లు, విశ్వనాథపురం-మొర్రాయపల్లి రోడ్డుకు రూ.1.50 కోట్లు, అల్లాడుపల్లె-ఏటూరు రోడ్డుకు రూ.3.20 కోట్లు నిధులతో నిర్మించారు. చాపాడు-వెదురూరు రోడ్డుకు రూ.2.30 కోట్లు మంజూరుకాగా ప్రస్తుతం పనులు చేపడుతున్నారు. అలాగే రామసుబ్బమ్మ కొట్టాలు-వెదురూరుకు రూ.4 కోట్లతో నిర్మాణం పూర్తయిన విషయం తెలిసిందే. అస్తవ్యస్తంగా మారిన అల్లాడుపల్లె-దేవళాలు రోడ్డును ప్రత్యేక నిధులు కింద రూ.80 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి.



తిప్పిరెడ్డిపల్లె వద్ద నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు

వెదురూరు రోడ్డులో భాగంగా తిప్పిరెడ్డిపల్లె గ్రామంలో సిమెంట్ రోడ్డు పనులు జరుగుతున్నాయని ఎఇ దాదాబాషా తెలిపారు. సిమెంట్ రోడ్డు పనులు పూర్తి కాగానే తారు రోడ్డు పనులు ప్రారంభిస్తామన్నారు.

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలి



డిటికి వినతిపత్రాన్నిస్తున్న విఆర్‌ఎ సంఘం నాయకులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ మనోహర్‌రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ఆర్ చిన్నమునయ్య మాట్లాడుతూ డిపార్టుమెంట్ ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారానికి విఆర్‌ఎలు ప్రధాన పాత్ర పోషి స్తున్నారన్నారు. పేరుకు మాత్రం పార్ట్‌టైమ్ ఉద్యోగులు కానీ రాత్రిపగలు తేడా లేకుండా పనిచేస్తున్నారన్నారు. 2017 మార్చి 24న ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్ విఆర్‌ఎల దీక్ష శిబిరంలో మాట్లాడుతూ అధికారంలోకి రాగానే సమస్యలు తక్షణమే పరిష్కరిస్తానని హామీ ఇచ్చినారన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు దాటినా విఆర్‌ఎల ఏ ఒక్క సమస్య పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో విఆర్‌ఎలు దస్తగిరి, నాయబ్ రసూల్, దానం పాల్గొన్నారు.

విద్యుద్దీపాలు వెలిగించాలని వినతి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పట్టణంలో నాగులకట్ట వీధి నుండి రైల్వేస్టేషన్ వరకు విద్యుద్దీపాల్లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను పరిష్కరించాలని విద్యుత్ శాఖ ఎడి రాజగోపాల్‌కు, ఆర్‌డిఒ కార్యాలయం అధికారి నిజాంకు గండికోట చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, సెక్రెటరీ పీరయ్య, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరణాల శివ నారాయణ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ గురువారం వినతిపత్రాలిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం ప్రజలు రైలు ప్రయాణం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లేందుకు జమ్మలమడుగు నుండి వందలాది మంది ప్రజలు ఆ రహదారి వెంబడి పోతుంటారని తెలిపారు. సమస్యను అధికారులు, ప్రజా ప్రతినిధులు పరిష్కరించాలని కోరుతున్నామన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



ట్యాబ్‌లతో విద్యార్థులు

ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

ట్యాబ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒలు రవిశంకర్, వంశీకృష్ణ తెలిపారు. కస్తూరిబా పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు గురువారం ఎంఇఒలు, సర్పంచ్ మహబూబ్‌బీ పంపిణీ చేశారు. అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ట్యాబ్‌ల పంపిణీపై విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ నాగలక్ష్మి , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **ముద్దనూరు :** మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో గురువారం విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి-1 పాలగిరి రేణుక, ఎంఇఒలు నాగేశ్వర్ నాయక్, సుబ్బారావు, ప్రధానోపాధ్యాయులు రాజబాబు, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **చక్రాయపేట :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు మండల వ్యాప్తంగా ఇన్‌ఛార్జి వైయస్ కొండారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని నాగలగట్టుపల్లె, మహాదేవపల్లె, చిలేకంపల్లి, చక్రాయిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఎంపిపి మాధవి బాలకృష్ణ, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాద్‌రావు, ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, మహాదేవపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, సర్పంచ్ శ్రీనివాసులు, ఎంఇఒ-2 రామచంద్రారెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ ఉత్తమరెడ్డి, జేసిఎస్ మండల ఇన్‌ఛార్జి లోమడ రామాంజనేయరెడ్డి, మహదేవపల్లె స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు బైజుస్ ట్యాబ్‌లను గురువారం పంపిణీ చేశారు. 168 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామాంజనేయులురెడ్డి తెలిపారు. మండల వ్యాప్తంగా మొత్తం 450 విద్యార్థులకుగానూ 170 ట్యాబ్‌లు ప్రభుత్వం నుండి అందాయని తెలిపారు. మిగిలినవి 2 రోజుల్లో పంపిణీ చేస్తామని ఎంఇఒ శివప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు చంద్రఓబుళరెడ్డి, ఈశ్వరయ్య పాల్గొన్నారు. **వేంపల్లె :** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి అన్నారు. గురువారం వేంపల్లె జిల్లా పరిషత్ బాలురపాఠశాల, మహాత్మా జ్యోతి బాపూలే పాఠశాలలో 8వ తరగతి విద్యా ర్థుల కు ట్యాబ్‌లను రవికుమార్‌రెడ్డి పంపిణీ చేశారు. ఉపాధ్యాయుడు రామ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేశారు. ఎంఇఒ స్టాలిన్, ఎంపిపి లక్ష్మి గాయత్రి, ఎంపిటిసి భారతి, వార్డు మెంబరు ముత్యాల ఆంజనేయులు, పాల్గొన్నారు. **సింహాద్రిపురం :** సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్ఆర్ విగ్రహం వద్ద మార్కెట్ యార్డ్ చైర్మన్ రామమోహన్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు బ్రహ్మానందరెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. విద్యార్థులకు వాటర్ బాటిళ్లు, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. నాయకులు రాష్ట్ర డైరెక్టర్ కిషోర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, ద్వారకనాథ్‌రెడ్డి, నీలవర్ధన్‌రెడ్డి, ఎంపిటిసి జాఫర్, మధు పాల్గొన్నారు.




రక్తదానం చేస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

అభివృద్ధి, సంక్షేమమే జగన్ ధ్యేయం : ఎంపీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

అభివృద్ధి, సంక్షేమమే సిఎం జగన్ ధ్యేయమని ఎంపీ అవినాష్‌రెడ్డి అన్నారు. గురువారం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను పులివెందుల నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వైఎస్ఆర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఎంపీ రక్తదానం చేశారు. నలపరెడ్డిపల్లె జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. పులివెందుల మార్కెట్ యార్డ్‌లో చిన్నప్ప అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ వైసిపి కన్వీనర్ వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర పౌర సరఫరాల డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, వేముల మండలం సాంబశివరెడ్డి, జగన్నాథరెడ్డి, సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, సోపాల వీర, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు చంద్రమౌళి, కౌన్సిలర్లు కిషోర్, రమణ, బలిజ సంఘం అధ్యక్షులు గూడూరు గురుప్రసాద్, కడియాల లక్ష్మీనారాయణ, కొంగనపల్లి మురళి, సారాయిపల్లె ప్రతాప్‌రెడ్డి, రమేష్ నాయుడు, కౌన్సిలర్ విజయ్‌కుమార్ నాయుడు పాల్గొన్నారు. **దువ్వూరు :** కస్తూర్బా పాఠశాలలో సిఎం జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు ఇరంగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి కానాల ఓబుల్‌రె, ఎంపిపి కానాల జయచంద్రారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** పట్టణ పరిధిలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు సిఎం జగన్ జన్మదినం సందర్భంగా ప్లకార్డులు చేబూని ర్యాలీ నిర్వహించారు. జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, జడ్పిటిసి బాలయ్య, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. సుందరయ్య నగర్‌లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శి ఆర్ఎస్ షాహిద్ ఆధ్వర్యంలో జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. విద్యార్థులతో కేక్ కట్ చేయించి పిల్లలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో రఘురాముడు, రుద్రసేన, అబ్దుల్ పాల్గొన్నారు. **వేంపల్లె :** జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి, ఎపిఐఐసి డైరెక్టర్ చంద్రఓబుల్ రెడ్డి, ఎపి సివిల్ సప్లయ్ డైరెక్టర్ షబ్బీర్ వలి, ఎంపిపి లక్ష్మి గాయత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 52 కిలోల కేక్‌నుకట్ చేసి సంబరాలు నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద హౌజ్‌హౌస్ డైరెక్టర్ మునీర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనాథ శరణాలయాల్లోని 70 మంది వృద్ధులకు అయ్యవారిపల్లి సర్పంచ్ రామగంగిరెడ్డి, లక్ష్మి పావని ఆధ్వర్యంలో బెడ్‌షీట్లు పంపిణీ చేశారు. తాళ్ళపల్లెలో బిసి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వడ్డరపు గంగాధర్ యాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మటన్ బాబా, సాదక్ వలి, ఎంపిటిసిలు భారతి, అసానయ్య, కటిక చంద్రశేఖర్, కాణిపాకం దేవస్థానం డైరెక్టర్ కొండయ్య, ముత్యాల ఆంజనేయులు, వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కుర్రాకుల వెంకటేష్, గండి చైర్మన్ రాఘవేంద్ర రావు పాల్గొన్నారు. **చాపాడు :** సిఎం జగన్ పుట్టినరోజు సందర్భంగా నాలుగు రోడ్ల కూడలిలోని వైఎస్సార్ విగ్రహం వద్ద ఎంపిపి టి.లక్ష్మయ్య, వైసిపి మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. ఖాదర్ పల్లిలో ముస్లిం మైనార్టీ నాయకులు జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. వైసిపి నాయకులు జయరామిరెడ్డి రామసుబ్బారెడ్డి, మహేష్, కిషోర్‌కుమార్‌రెడ్డి, రమణయ్య, ప్రసాద్, వెంకటరెడ్డి పాల్గొన్నారు. **మైదుకూరు :** సిఎం జగన్ జన్మదిన వేడుకలను పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, కేక్ కట్, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ మాచునూరు చంద్ర ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ రంగస్వామి పాల్గొన్నారు. స్థానిక బద్వేల్ రోడ్డులోని మార్కెట్ సర్కిల్‌లో వైసిపి రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర సేవాదల్ ప్రెసిడెంట్ రాచమల్లు రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. **ముద్దనూరు :** సిఎం జగన్ పుట్టినరోజు సందర్భంగా వైసిపి నాయకులు వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలిలో జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పిహెచ్‌సిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. **కడప :** సిఎం జగన్ జన్మదిన సందర్భంగా వైసిపి జిల్లా కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష, మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్ కేకును కట్ చేశారు. పేదలకు దుప్పట్లు అందజేశారు. కడప నగరంలోని సంధ్యా సర్కిల్లో రహీం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. వారణాసి ప్రతాపరెడ్డి హాస్పిటల్ దగ్గర డాక్టర్ సెల్ శివ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, రక్తదాన శిబిరం నిర్వహించారు. **పోరుమామిళ్ల :** జగన్ పుట్టిన రోజున రంగసముద్రం పంచాయతీలోని బ్లెస్డ్ బ్రయాన్ అనాధాశ్రమంలో రాష్ట్ర ఆహార కమిషన్ చైర్ పర్సన్ చిత్త విజయ్ ప్రతాపరెడ్డి, నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షులు చిత్త గిరి ప్రణీత్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జగనన్న జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి ముత్యాల ప్రసాద్, ఎంపిటిసి మహబూబ్‌పీరా, బాలుడు, చిన్నరాయుడు, కొండయ్య, బాష పాల్గొన్నారు **అట్లూరు :** సిఎం జగన్ పుట్టినరోజు వేడుకలను శ్రీ అవదూత అభిరెడ్డి స్వామి ఆలయ ఆవరణంలో వైసిపి మండల అధ్యక్షులు పొత్తపిరమాదేవి, ఇన్‌ఛార్జి ఎంపిపి పోతిరెడ్డి రెడ్డయ్య ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో వరికుంట సర్పంచ్ రమణ, మాజీ సర్పంచ్ నాగం లక్ష్మి నర్సారెడ్డి, వైసిపి నాయకులు కొల్లు సుబ్బారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, కలువాయి రామారెడ్డి, డబ్బుగుట్ల, వెంకటేశ్వర్లు డీలర్, దున్నుతుల ప్రతాప్ రెడ్డి, పోతిరెడ్డి మనోజ్ కుమార్ రెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షురాలు పోతిరెడ్డి భాగ్యమ్మ, వార్డ్ మెంబర్ వెంకటయ్య, రేవూరి గోపాలయ్య, వరుకుంట రాజా పాల్గొన్నారు. **కలసపాడు :** జగన్ పుట్టిన రోజు వేడుకలు వైసిపి కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎపి టూరిజం డైరెక్టర్ పోకల రామ కృష్ణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సగిలి సుదర్శన్, మండల వైసిపి ఇన్‌ఛార్జి అంకన గురివిరెడ్డి, ఎంపిపి రెడ్డిపల్లె నిర్మల నారాయణ, జెసిఎస్ మండల అధ్యక్షులు చిత్త, రాజశేఖర్ రెడ్డి, రాజుపాలెం సర్పంచ్, సుధా రామకృష్ణారెడ్డి, చైర్మన్లు, డైరెక్టర్లు అనుబంధ, సంఘాల నాయకులు సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు. **చెన్నూరు :** సిఎం జగన్ జన్మదిన వేడుకలు పార్టీ నాయకులు పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. పాత బస్టాండ్‌లో కడప మార్కెట్ మాజీ అధ్యక్షులు పెడ పల్లె గణేష్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వీట్లు పంచిపెట్టారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంచారు. మండల కన్వీనర్ జిఎన్ భాస్కర్ రెడ్డి, ఎంపిపి చీర్ల సురేష్ యాదవ్, శ్రీరామ్ మూర్తి, పెడబల్లె ప్రదీప్ కుమార్‌రెడ్డి, పుల్లారెడ్డి, నిత్య పూజయా, రామాం జనేయులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. **కొండాపురం :** రాష్ట్రంలో సంక్షేమ పథకాలు మరికొంతకాలం అమలు జరగాలని వైసిపి మండల కన్వీనర్ వెంగళ జగదీశ్వరరెడ్డి కోరారు. సిఎం జగన్ పుట్టినరోజు వేడుకలు వైసిపి కార్యాలయంలో మండల ఉపాధ్యక్షుడు కె.వై.చంద్రశేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ శేఖర్, సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వేంపల్లెలో కేక్ తినిపించుకుంటున్న రవికుమార్‌రెడ్డి, షబ్బీర్, నాయకులు

సొంతింటి కల నెరవేర్చిన సిఎం జగన్

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ప్రజల తరపున తాము ఎప్పటికీ రుణపడి ఉంటామని ఎమ్మెల్యే రాచామల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమలవారిపల్లి పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీలో గురువారం ఆయన పేదలకు ఇంటి తాళాలను అప్పగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అద్దె ఇళ్లలో పేద ప్రజలు ఇబ్బంది పడుతుంటే, వాటిని అధిగమించాలని సిఎం ఇళ్లు ఇచ్చారన్నారు. రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజల అవసరాలు తెలుసుకోకుండా తన అవసరాలను తీర్చుకున్న వ్యక్తి చంద్రబాబు అని విమర్శించారు. జగన్మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాలు కొంతమంది పెత్తందారులకు నచ్చకపోవచ్చునని తెలిపారు. పేద ప్రజల ఆరోగ్యం, ఆయుస్సును ఆలోచించాల్సిన అవసరం ముఖ్యమంత్రిపై ఉందన్నారు. ప్రొద్దుటూరు నియో జకవర్గంలో 24 వేల మందికి ఇళ్లస్థలాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, అప్కాబ్ చైర్మన్ ఝాన్సీరాణి, ఎంపీపీ శేఖర్ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

కనీస వసతులకు పెద్దపీట

- జడ్‌పి సిఇఒ సుధాకర్‌రెడ్డి

సింహాద్రిపురం : గ్రామీణ ప్రాంతాల్లో కనీస వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జడ్‌పి సిఇఒ సుధాకర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన సింహాద్రి పురం నూతన ఎంపిడిఒ కార్యాలయాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిఇఒ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నూతన ఎంపిడిఒ కార్యాలయాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. సిఎం పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సిఇఒ రమణారెడ్డి, డిఎల్‌పిఒ సురేంద్ర, ఎంపిడిఒ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కూరగాయల వ్యాపారులకు గుర్తింపు కార్డులు

ప్రొద్దుటూరు : కూరగాయల మార్కెట్‌లో వాపారం చేసుకునే వారికి భద్రత ఏర్పడిందని, ఆ మేరకు వారికి గుర్తింపు కార్డులను మంజూరు చేశామని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. ఈ మార్కెట్‌లో వ్యాపారాలు చేసుకునే పూలు, పండ్లు, కూరగాయలు, కిరాణా వ్యాపారస్తులు 450మందికి గురువారం గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో మార్కెట్‌లో వ్యాపారస్తులు, వినియోగదారులు పలు కష్టాలు పడుతుండే వారని గుర్తు చేశారు. వర్షం వస్తే అప్పటి మార్కెట్‌లో పరిస్థితి వర్ణనాతీతంగా ఉండేదన్నారు. సమస్య పరిష్కారానికి అధునాతన కూరగాయల మార్కెట్‌కు అడ్డంకులను ఎదుర్కొని రూ.53కోట్లతో నూతన మార్కెట్ నిర్మాణాన్ని మొదలు పెట్టినట్లు తెలిపారు. వ్యాపారస్తులకు రాచమల్లు అను నేను అండగా ఉంటానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీదేవి, కమిషనర్, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

దేవాలయానికి రూ.50 వేలు విరాళం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చేతులు మీదుగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గోటూరు చిన్నప్ప గోటూరు గ్రామంలోని రామాలయం దేవాలయానికి రూ.50వేలు విరాళం అందజేశారు. అనంతరం అక్కడే చీనీ వ్యాపారస్తులు ఏర్పాటు చేసిన కేక్ కట్ చేశారు.

వైసిపి పని అయిపోయింది

- మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

లోకేష్ యువగళంతో వైసిపి పరిస్థితి అయిపోయిందని మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి అన్నారు. తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. లోకేష్ నేడు పరిపూర్ణ పరిణతి చెందిన నాయకుడుగా మారారని పేర్కొన్నారు. ప్రజలు ఆయనను నమ్ముతున్నారని, తనను తాను ఆయన ఆలోచన ద్వారా రుజువు చేసుకున్నారని పేర్కొన్నారు. ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టడానికి వైసిపి ప్రభుత్వ సమయం సరిపోలేదన్నారు. ఎమ్మెల్యేలను మార్చడం కాదు.. సిఎంపైనే ప్రజలు అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. 175 నియోజకవర్గాల్లో వైసిపి పని అయిపోయిందన్నారు. 2024 ఎన్నికల్లో టిడిపి 160 అసెంబ్లీ, 25 ఎంపీ సీట్లు గెలవనుందన్నారు. కార్యక్రమంలో గుర్రప్ప, సిద్దయ్య పాల్గొన్నారు.

ఎస్‌బిఐ ఆధ్వర్యంలో రైతులకు సన్మానం

ప్రజాశక్తి - దువ్వూరు

స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గురువారం రైతులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్‌బిఐ మేనేజర్ గణేష్ మాట్లాడుతూ ఈనెల 23న రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఇందులో భాగంగా రైతులు శాస్త్రీయ పద్ధతిలో వ్యవసాయం, గ్రామాల్లో ఎస్‌బిఐ పథకాల గురించి అవగాహన కల్పిస్తున్న రైతులను సన్మానించామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ శశి కుమారి, ఫీల్డ్ ఆఫీసర్ భీమా నాయక్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.



రైతులను సన్మానించిన ఎస్‌బిఐ అధికారులు